# రేపు రెండో విడుత ర్యాండమైజేషన్

- నాలుగు సెగ్మెంట్లకు 6,817 యంత్రాల కేటాయింపు
- పరిశీలకుల సమక్షంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

కలెక్టరేట్, నవంబర్ 16: శాసనసభ ఎన్నికల పోలింగ్ తేదీకి గడువు సమీపిస్తుండగా, అవసరమైన ఏర్పాట్లు చేయడంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం నిమగ్నమైంది. ఈనెల 30న పోలింగ్ జరుగనుండగా, ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కావాల్సిన ఎలక్ట్రానిక్ యంత్రాలను సన్నద్ధం చేయడంలో తలమునకలయ్యారు. ఇప్పటికే మొదటి విడుత ర్యాండమైజేషన్ గత నెల 20న పూర్తి చేసిన అధికారులు జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోడౌన్ నుంచి తరలించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు ఆయా నియోజకవర్గాలకు పంపిణీ చేసి, వాటి పరిధిలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండగా, తాజాగా రెండో విడత ర్యాండమైజేషన్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లుండగా, కరీంనగర్‌లో 390, చొప్పదండిలో 327, మానకొండూర్‌లో 316, హుజూరాబాద్‌లో 305 మొత్తంగా 1,338 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా నియోజకవర్గాలకు 2,674 బ్యాలెట్ యూనిట్లు, 2089 కంట్రోల్ యూనిట్లు, 2054 వీవీప్యాట్లను కేటాయించారు. వీటిని ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన పరిశీలకుల సమక్షంలో శనివారం ర్యాండమైజేషన్ చేయనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, పరిశీలకుల సమక్షంలో ర్యాండమైజేషన్ చేపట్టనున్నారు. ఆన్‌లైన్‌లో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తారు. ఈవీఎంలకు వేసిన నంబర్ల ప్రకారం వాటిని పోలింగ్ కేంద్రాలకు కేటాయించే విధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, పరిశీలకులకు జిల్లా ఎన్నికల అధికారులు నమూనాగా చూపనున్నారు. ఇలా కేటాయించిన ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది, ఓటింగ్‌కు ఒక రోజు ముందు ఈనెల 29న పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తారు. తరలింపు ప్రక్రియ మొత్తం రిటర్నింగ్ అధికారి సమక్షంలో జరుగనుండగా, ప్రతి పనిని వీడియో రికార్డింగ్ ద్వారా కెమెరాల్లో నిక్షిప్తం చేయనున్నారు. కాగా, ఈవీఎంల పని విధానంపై ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు నాలుగు ప్రచార వాహనాలు ఏర్పాటు చేసి, వాటిలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు ఏర్పాటు చేసి, గ్రామాలు, కాలనీల్లో తిరుగుతూ వాటి పనితీరుపై క్షుణ్ణంగా వివరించి ప్రజల్లో చైతన్యం తెచ్చారు. ఈవీఎంలతో నిరక్షరాస్యులు గందరగోళానికి గురవుతుండగా, ఓటేయక పోవడమే మేలనే దృక్పథంతో ఉన్న వారిలో ఓటు వేయాలనే ఆకాంక్షను తెచ్చేలా ముందస్తుగా ప్రచారం నిర్వహించారు. దీంతో, ఈసారి ఈవీఎంల వినియోగం అధికంగా ఉండే అవకాశం ఉండగా, ప్రతి యంత్రాన్ని పలుమార్లు తనిఖీ చేస్తూ, వాటి పనితీరును గమనించే క్రమంలోనే ర్యాండమైజేషన్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న డీఈవో, ఇతర అధికారులు

# బీఎల్‌వోలు నిబద్ధతతో విధులు నిర్వహించాలి

- వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలి
- డీఈవో పమేలా సత్పతి
- ఓటరు స్లిప్పుల పంపిణీపై దిశానిర్దేశం

కలెక్టరేట్, నవంబర్ 16: ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ జరిపించడంలో బూత్‌స్థాయి అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్ బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ అధికారులతో ఓటరు స్లిప్పుల పంపిణీపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ప్రతి బీఎల్‌వో వారి పోలింగ్ బూత్‌లు సందర్శించి ఏర్పాట్లు సమీక్షించుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందుగానే ప్రతి బూతు వద్ద ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు అవగాహన పోస్టర్లు అతికించాలన్నారు. ప్రతి పీఎస్ వద్ద నెంబర్, బీఎల్‌వో పేరు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ బూతుల వారీగా ఓటరు స్లిప్పులను జాగ్రత్తగా వారికి చేరవేయాలన్నారు. ఓటరు స్లిప్పులతో పాటు గుర్తించిన 12రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రానికి తెచ్చుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీని రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. స్లిప్పుల పంపిణీకి సంబంధించి నివేదికను ఎప్పటికప్పుడు అందించాలని వెల్లడించారు. చొప్పదండి సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రతి బీఎల్‌వో వారి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరు స్లిప్పుల పంపిణీకి ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. దాని ప్రకారం పకడ్బందీగా పనులు పూర్తి చేయాలన్నారు. ఓటరు స్లిప్పులు ఇవ్వకుండా బయటపడేస్తే, రికార్డులు తారుమారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ రోజు కనీసం 400 మంది ఓటర్లకు స్లిప్పులు అందజేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై థర్డ్ జెండర్లకు అవగాహన

కలెక్టరేట్,నవంబర్ 16: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును థర్డ్ జెండర్లు వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. స్వీప్‌లో భాగంగా గురువారం ఓటు హక్కుపై స్థానిక స్వశక్తి కళాశాలలో థర్డ్ జెండర్లకు నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో అర్హులైన 56మంది థర్డ్ జెండర్లకు ఓటు హక్కు కల్పించినట్లు తెలిపారు. థర్డ్‌జెండర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును సంపూర్ణంగా వినియోగించుకున్న జిల్లాగా కరీంనగర్‌కు పేరు తేవాలని కోరారు. థర్డ్ జెండర్లు తక్కువగా ఉన్న చోట స్వయం సహాయక సంఘాల స్థాపనకు ఇబ్బందులు ఎదురైతే మెప్మా ద్వారా సంఘాన్ని బలోపేతం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో శ్రీలతను ఆదేశించారు. ఆధార్, ఆహారభద్రత కార్డు పొందినట్లే, ఓటరు గుర్తింపు ఎపిక్ కార్డులు కూడా కలిగి ఉండాలన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారితో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సరస్వతి, సఖీ కేంద్ర నిర్వాహకురాలు లక్ష్మి, మైత్రీ ఎన్జీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# దొంగల చేతిలో పెట్టొద్దు

- తెలంగాణను ఆగం చేయొద్దు
- ఒక్క ఓటు తప్పు వేస్తే భవిష్యత్ అంధకారమే
- ఆంధ్రోళ్లు చెప్పినట్టే కాంగ్రెస్, బీజేపీ వింటయ్
- కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని పలు డివిజన్లు, చామనపల్లి, బహద్దూర్‌ఖాన్‌పేటలో విస్తృత ప్రచారం


చామనపల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల

కరీంనగర్ రూరల్, నవంబర్ 16 : సమైక్య పాలనలో అనేక కష్టాలు అనుభవించామని, ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దని బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ కోరారు. గురువారం కరీంనగర్ మండలంలోని చామనపల్లి, బహద్దూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో ప్రచారం చేయగా గ్రామస్తులు, మహిళలు మంగళహారతులు పట్టి, డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఆయా చోట్ల మాట్లాడుతూ పచ్చని తెలంగాణను దోచుకునేందుకు ఆంధ్రోళ్లు కడుపునిండా విషం పెట్టుకుని వచ్చారని మండిపడ్డారు. సమైక్య రాష్ట్రంలో అనుభవించిన కష్టాలతో నల్లబడ్డ తెలంగాణ ప్రజల ముఖాలు... స్వరాష్ట్ర పాలనలో తెల్లబడ్డాయని చెప్పారు. 2009 ఎన్నికలప్పుడు చామనపల్లి గ్రామం చొప్పదండి నియోజక వర్గం నుండి కరీంనగర్‌లో కలిసిందని, నాడు గ్రామంలో రోడ్లు, తాగునీరు లేవని, కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితిలో రైతులు పొలం వద్ద పడిగాపులు కాసి పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులను గుర్తు చేశారు. పదేళ్ల స్వయం పాలనలో కోట్లాది రూపాయల నిధులు తెచ్చి పల్లెలను అభివృద్ధి చేశామన్నారు. కాళేశ్వరం జలాలతో పల్లెలు సస్యశ్యామలం అయ్యాయన్నారు. పచ్చని తెలంగాణలో చిచ్చు పెట్టాలని బీజేపీ ముసుగులో కిరణ్‌కుమార్‌రెడ్డి, జనసేన ముసుగులో పవన్‌కల్యాణ్, కాంగ్రెస్ ముసుగులో కేవీపీ, షర్మిల హైదరాబాద్‌లో అడ్డా వేశారని, కేసీఆర్‌ను ఓడించి తెలంగాణను దోచుకెళ్లాలని చూస్తున్నారని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఒక్క ఓటు తప్పు జరిగితే మన పిల్లల భవిష్యత్ ఆంధకారమవుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆంధ్రోళ్లు చెప్పినట్టు వింటాయని, వాటికి అధికారం కట్టబెడితే మరోసారి దోచుకుని గుడ్డిదీపం చేస్తారని, తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టి ఆగం చేయొద్దని కోరారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ అభ్యర్థిగా భూకబ్జాదారుడు వస్తున్నాడని, ఆయనపై 30కి పైగా కేసులున్నాయని, ఒక రౌడీషీటర్ అని, ఆయనకు ఓటేసి గెలిపిస్తే మన భూములను కబ్జా చేస్తాడని చెప్పారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తరువాత ఎప్పుడైనా కనిపించాడా? ప్రజల కష్టాలు పట్టించుకున్నాడా? అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి కోసం రూపాయి కూడా తేలేదని, తాను మాత్రం మీ బిడ్డగా మీ మధ్యనే ఉన్నానని, గుర్తు చేశారు. విలువైన ఓటును వృథా చేయకుండా మచ్చలేని మీ బిడ్డను ఆశీర్వదించాలని కోరారు.

### కోట్ల రూపాయలతో రోడ్లు వేశాం

చామనపల్లి గ్రామ నుంచి ఇరుకుల్లకు, బహద్దూర్‌ఖాన్‌పేటకు, ఫకీర్‌పేటకు, ఎలబోతారానికి, జూబ్లీనగర్‌కు, చాకుంటకు, చెర్లభూత్కూర్‌కు కోట్ల రూపాయలతో రోడ్లు వేశామని, ఎస్సారెస్పీ కాలువ నుంచి ప్రత్యేక ఫీడర్ ఛానల్ ద్వారా కెనాల్ ఏర్పాటు చేసి, గ్రామంలోని రాజసముద్రం చెరువకు నీటిని తీసుకువచ్చామని మంత్రి గంగుల తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు అందంగా కనిపిస్తున్నాయని వివరించారు. తనను మరోసారి గెలిపిస్తే, మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. మంచోళ్లు ఎవరు?, దొంగ ఎవరు? అనే విషయాలపై చర్చ జరగాలని, అభివృద్ధికి ఓటేసి, సీఎం కేసీఆర్ చేతులను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, శ్యాంసుందర్, సర్పంచ్‌లు బొగొండ లక్ష్మి, ఐలయ్య, తప్పట్ల భూమయ్య, దాది సుధాకర్, రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, బల్ల అంజనేయులు, జగల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, ఎల్లాగౌడ్, నర్సింగ్, పబ్బతి రంగారెడ్డి, గర్వంధ శ్రీనివాస్ పాల్గొన్నారు.


చామనపల్లిలో కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

# ఓటరు సెల్ఫీ పాయింట్ వద్ద సందడి

- ఫొటోలకు ఉత్సాహంగా ఫోజులిచ్చిన థర్డ్ జెండర్లు, బీఎల్‌వోలు
- వంద శాతం ఓటింగే లక్ష్యంగా ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలు
- ఆసక్తి కనబరుస్తున్న ఓటర్లు

కలెక్టరేట్, నవంబర్ 16: ఓటరు చైతన్యమే లక్ష్యంగా, కొత్త ఓటర్లను ప్రోత్సహించడమే ధ్యేయంగా జిల్లా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ పాయింట్‌లో గురువారం థర్డ్‌జెండర్లు సందడి చేశారు. ఒకరికొకరు పోటీ పడుతూ ఫొటోలు దిగుతూ వాటిని వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్ట్ చేశారు. వంద శాతం ఓటింగే లక్ష్యంగా స్వీప్ ఆధ్వర్యంలో స్వశక్తి భవనంలో థర్డ్‌జెండర్లకు నిర్వహించిన అవగాహన శిబిరంలో పాల్గొన్న కలెక్టర్, సెల్ఫీ పాయింట్‌పై వారికి వివరించారు. దీంతో స్వశక్తి భవనంలో నిర్వహించిన సమావేశం పూర్తి కాగానే, వారంతా కలిసి కలెక్టరేట్‌కు వచ్చి సెల్ఫీలు దిగుతూ కనిపించారు. ఈ సందర్భంగా థర్డ్ జెండర్ల సంఘం నాయకురాలు ఆశ మాట్లాడారు. తమను ఎన్నికల సంఘం గుర్తించి, ఓటు హక్కు కల్పించడం సంతోషం కలిగిస్తుందన్నారు. తమ సంక్షేమంపై కలెక్టర్ పమేలా సత్పతి కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధపై వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన బీఎల్‌వోల అవగాహన కార్యక్రమం ముగిసిన అనంతరం చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన వందలాది మంది బీఎల్‌వోలు కూడా సెల్ఫీ పాయింట్ వద్ద గుమిగూడి, ఫొటోలు దిగేందుకు ఉత్సాహం కనబరిచారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన పలు వినూత్న కార్యక్రమాలతో ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించేవారు కూడా తాజాగా ఆసక్తి కనబరుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.





ఓటరు సెల్ఫీ పాయింట్ వద్ద సందడి చేస్తున్న థర్డ్‌జెండర్లు, బీఎల్‌వోలు